క్లుప్తంగా

టీకాలు వేయించండి



జీవాలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): గొర్రెలు, మేకల్లో నల్ల మబ్బు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాజు అన్నారు. సోమవారం మండలంలోని ముట్రాజ్‌పల్లి, తునికి తదితర గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నల్లమబ్బు వ్యాధి నివారణకు పశువైద్యులు ముందస్తుగా టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీఓ కృష్ణకుమార్, ఎల్‌ఎస్‌ఏ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య పాల్గొన్నారు.

పగిలిన భగీరథ పైప్‌లైన్



వృథాగా పోతున్న నీరు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్ సమీపంలో సోమవారం భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా వృథాగా పోయింది. పైప్‌లైన్ భూమిలోపలి నుంచి కాకుండా పై నుంచి వేయడంతో పొదలు తొలగించే క్రమంలో పగిలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గంగాయిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజిరెడ్డి పొలంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. చేతికి వచ్చిన వరిపంటను యంత్రం ద్వారా కోసే పరిస్థితి లేదని రైతు వాపోయాడు. గ్రామంలోని పలుచోట్ల ఇలాగే విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్న విషయం సంబంధిత విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఈ విషయం గురించి ట్రాన్స్ కో ఈఈ దుర్గప్రసాద్ వివరణ కోరగా.. కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మండల ముదిరాజ్ సంఘం ఎన్నిక



నూతన ముదిరాజ్ కమిటీ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌లో నూతన గ్రామ ముదిరాజ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తప్పెట హరిబాబు తెలిపారు. సోమవారం కమిటీలో ఉపాధ్యక్షులుగా నెల్లూర్, రమేశ్, కోశాధికారి నాగరాజు, సలహాదారులుగా మల్లేశ్, శ్రీనివాస్, బాలేశ్, గుండ్ల నర్సింలు, పోచాలు, యాదయ్య, నర్సింలు, యువ సమూహం సభ్యులు శేఖర్, మహేశ్, దుర్గేశ్, చిన్న మహేశ్, అశోక్, కిట్టు, బాలకృష్ణ, మల్లేశ్, రాజు, పెద్దస్వామి, అమర్నాథ్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట్‌లో దుర్గమ్మ ఉత్సవాలు రెండో రోజు సోమవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, భవిష్యవాణి వినిపించారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు యాదగిరి పాలకవర్గం సభ్యులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): పేకాట ఆడితే ఎంతటి వారున్నా.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజయ్య సోమవారం హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడ పేకాట ఆడినా తమకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపితే చర్యలు తప్పవన్నారు. అదే విధంగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రయాణం చేసే ముందు వాహనదారులు ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.

‘తెల్ల’బోతున్న రైతన్న



కోనాపూర్ శివారులో పత్తిని తెంపుతున్న కూలీలు

- అధిక వర్షంతో తగ్గిన దిగుబడి
- నష్ట పరిహారం చెల్లించాలంటున్న రైతులు

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలంలో సాధారణంగా వరిపైనే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. కాని ఐదారేళ్ల నుంచి పత్తికి మద్దతు ధర ఎక్కువగా లభించడం, మండలంలో పత్తి పంట సాగుకు భూములు అనుకూలంగా ఉండడంతో చాలా మంది రైతులు పత్తి సాగుకు ఆసక్తి చూపారు. స్థానికంగా పంట కొనుగోలు సౌకర్యాలు లేనప్పటికీ, లాభాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడు వర్షాకాలంలో కూడా రైతులు పత్తి పంట సాగు చేశారు. భారీ స్థాయిలో వర్షాలు పడడం పంట మొదట్లో ఇబ్బందులు ఎదురవలేదు. అయితే చివర్లో కురిసిన భారీ వర్షం వల్ల పత్తి మొక్క పూలు రాలిపోవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టాల పాలయ్యారు.

1500 ఎకరాలకు పైగా సాగు

మండలంలోని ఎనగండ్ల, కోనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్, పైతర, తుక్కాపూర్ గ్రామాల్లో అత్యధికంగా పత్తి సాగు చేయగా రంగంపేట, ఇతర గ్రామాల్లో కొంతమేర సాగు చేశారు. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం ఈ వానాకాలంలో 1054 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ 1500 ఎకరాలకు పైగా పంట సాగు చేసినట్టు రైతులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం

పంటపూత దశలో ఉన్న చివర్లో కురిసిన భారీ వర్షం వల్ల రాలిన పూలతో చెట్టుకు సగానికి పైగా పత్తి కాయలు కాయలేదు. అది దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలో పత్తి తెంపే పనులను రైతులు చేపట్టారు. ఎకరం పత్తి పంటలో కేవలం 25 శాతం మాత్రమే పత్తి దిగుబడి వస్తుందని రైతులు, కూలీలు చెబుతున్నారు. పంట పూర్తి కాలంలో నాల్గు సార్లు తెంపాల్సిన పత్తిని, ఈసారి రెండు సార్లకు మాత్రమే పరిమితమవుతుందన్నారు. పత్తి మద్దతు ధర పెంచినా, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడం ప్రైవేట్ వ్యక్తులకు పత్తిని అమ్మడంతో మరింత నష్టంల్లోకి కూరుకుపోవాల్సిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ఈ సారి పత్తి సాగుతో నష్టమే..



పంట సాగు చేసిన మొదట్లో వర్షాలు పంటకు పూర్తిగా అనుకూలించాయి. చివర్లో మాత్రం వర్షం పంటను తీవ్రంగా దెబ్బతీసింది. ఎకరం సాగుకు రూ.20 వేలు పెట్టినా దిగుబడి రాకపోవడం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ఈసారి పత్తి సాగు అప్పులకుప్పే. – శ్రీశైలం, రైతు, ఎనగండ్ల

పరిహారం అందించాలి



తెల్లబంగారం దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు వస్తేనే రైతుకు లాభం. కాని ఇప్పుడు 4 నుంచి 5 క్వింటాళ్లు కంటే ఎక్కువ రాదు. అప్పులు చేసి పంట సాగు చేశాం. వర్షంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకొని నష్టపరిహారం అందించాలి.

– దేవదాసు, రైతు, కోనాపూర్

వందశాతం ఓటింగ్ సాధించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

కొల్చారం(నర్సాపూర్): భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని, ఎన్నికల్లో మండల వ్యాప్తంగా వందశాతం ఓటింగ్ సాధించాలని ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్ కొంగోడ్, అంసాన్‌పల్లి గ్రామాల్లో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు హక్కును సరిగ్గా వినియోగించుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దు

నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ఇస్తున్న ఉచిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళి, సీనియర్ నాయకులు, విగ్రాం వేణుగోపాల్‌గౌడ్, ఆర్‌ఎస్.సంతోశ్, సుభాశ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపార్టీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

కేసీఆర్ భారీ మెజార్టీకి కృషి: అమీర్

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్ భారీ మెజార్టీకి కృషి చేస్తామని రాష్ట్ర కేసీఆర్ సేవాదళం అధ్యక్షుడు అమీర్ అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి, మనోహరాబాద్ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వీరోజిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ రాజేశ్‌కుమార్



మనోహరాబాద్(తూప్రాన్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ యాదగిరిరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెద్దశంకరంపేట, రామోజిపల్లి, వీరోజిపల్లి తదితర గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఏఓ రాజేశ్‌కుమార్ తెలిపారు. రైతులు దళారులను నమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఏఈఓ మమత, సిబ్బంది సాయిరెడ్డి, మోహన్ తదితరులున్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ యాదగిరిరెడ్డి అన్నారు. మండలంలోని దండుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా, ఎప్పటికప్పుడు ధాన్యంను కొనుగోలు చేసిన గోదాంలకు తరలించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈఓ నరేందర్, సీఓఈ దినేశ్, నిర్వాహకులు రమేశ్, రైతులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం’

తూప్రాన్: ప్రజల ఆశీర్వాదంతో గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పల్లెర్ల రవీందర్‌గుప్తా, మహిందర్‌రెడ్డి, హలీం, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి చేయాలి

రేగోడ్(మెదక్): మహిళల అభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రం రేగోడ్‌లోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయాన్ని సోమవారం పరిశీలించారు. సీసీలు, వీఓఏలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలతో కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేయించి, వారి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సంగీత, సీసీ రాములు పాల్గొన్నారు.

‘ఉద్యమకారులకు విలువలేదు’

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్‌ఎస్ పార్టీలో ఉద్యమకారులకు విలువలేదని, వారిని కేసీఆర్ పట్టించుకోలేదని అందుకే గజ్వేల్‌లో ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు బోల్లి పాండు అన్నారు. సోమవారం మనోహరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనోహరాబాద్, తూప్రాన్ మండలాలకు చెందిన ఉద్యమకారులకు బీఆర్‌ఎస్ పార్టీలో ఎలాంటి న్యాయం జరగడం లేదనన్నారు. అందుకే కేఏ పాల్‌ను కలిసి ప్రజాశాంతి పార్టీలో చేరినట్లు తెలిపారు. అంతేకాకుండా సోమవారం గజ్వేల్‌లో నామినేషన్ వేసినట్లు తెలిపారు.

దామోదర గెలుపు తథ్యం

అల్లాదుర్గం(మెదక్): అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహ గెలుపు తథ్యమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. సోమవారం అల్లాదుర్గం ధ్యాయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేఖత ఉందన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవ్

నర్సాపూర్ రూరల్: బీసీ బిడ్డగా మీ ముందుకు వచ్చిన.. ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరుతూ నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవ్ ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని తుజాల్‌పూర్, తిరుమలాపూర్, బ్రాహ్మణపల్లితో పాటు ఆయా గ్రామాల్లో పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేశ్‌గౌడ్, సురేశ్, రాజేందర్, శంకర్, యాదగిరి, బాలరాజ్, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్ కోరారు. సోమవారం మండలంలోని కొంగోడ్, నాయిని జలాల్ పూర్, అంసాన్ పల్లి, రాంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కన్నయ్య, కార్యదర్శి రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ప్రకాశ్, యువ మోర్చా అధ్యక్షుడు హరీశ్, రంగంపేట బూత్ అధ్యక్షుడు గిరి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఆయా పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు.

‘గ్యారంటీ’ పథకాలను వివరించండి

రేగోడ్(మెదక్): చేయి గుర్తుకు ఓటేసి అందోల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించాలని పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి ప్రజలను కోరారు. సోమవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామానికి చెందిన పదిమంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా బురాన్‌వాడీ తండాకు చెందిన 15 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, జెడ్పీటీసీ యాదగిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, నాయకులు డి.శివకుమార్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పంపరి స్వామి(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన తూప్రాన్ – నర్సాపూర్ హైవే శివ్వంపేట వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన పంపరి స్వామి(28) టెంట్‌హౌజ్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి శివ్వంపేటకు వచ్చి సోమవారం తెల్లవారుజామున బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో స్వామికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



రఘునాథ్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన బట్టమ్మ గుడి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సోమవారం ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్ సంజయ్ రఘునాథ్(45) హైదరాబాద్ శామీర్‌పేటలోని లారీ యజమాని వెంకటేశం వద్ద ఆరునెలలుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి శామీర్‌పేట నుంచి మెదక్‌కు ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లు తీసుకురావడానికి వెళ్లాడు. అర్ధరాత్రి కౌడిపల్లిలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆవు మృత్యువాత

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆవు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నిర్మల్ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో మనోహరాబాద్ మండలం జీడిపల్లి శివారులోకి రాగానే ముప్పిరెడ్డిపల్లికి చెందిన రైతు ఆవు రోడ్డు దాటుతుండగా బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆవు అక్కడిక్కడే మృతి చెందింది.

మడూర్ పాఠశాలలో మాక్‌పోలింగ్



మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం విరేందర్‌రెడ్డి ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఓటు హక్కు ప్రధాన్యతను వివరించారు. ఇదులో 240 మంది విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకోగా, ముగ్గురు లీడర్లుగా విద్యార్థులు పోటీలో నిలిచారు. మాక్‌పోలింగ్ ప్రక్రియను ఉపాధ్యాయలు బస్వరాజ్, రజిత పర్యవేక్షించారు.

రోహిత్‌కు వ్యతిరేకంగా మాట్లాడాలని ఒత్తిడి

– ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యుడు రమేశ్ నాయక్



మాట్లాడుతున్న రమేశ్ నాయక్

మెదక్: తమను బలవంతంగా మంత్రి హరీశ్‌రావు వద్దకు తీసుకెళ్లి మైనంపల్లి రోహిత్‌రావుకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టాలని ఒత్తిడి తెచ్చినట్లు మైనంపల్లి సోషల్ సర్వీస్ అసోసియేషన్(ఎంఎస్‌ఎస్‌ఓ) సభ్యుడు రమేశ్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, హవేళిఘనాపూర్ మండలంలోని పలు గిరిజన తండాల ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యులతో కలిసి మాట్లాడారు. కొచ్చెరువు తండాకు చెందిన రంజిత్‌నాయక్ తాను ఏడు నెలలుగా ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యులుగా కొనసాగుతున్నామని, నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఎంఎస్‌ఎస్‌ఓ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌రావు సూచన మేరకు తాగునీటి సమస్య ఉన్న గ్రామాలు, తండాల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నామన్నారు. అయితే ఈ నెల 4న మెదక్ పట్టణానికి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులు తనతో పాటు రంజిత్‌నాయక్‌ను జహీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌కు తీసుకెళ్లారని, అక్కడ మంత్రి హరీశ్‌రావు ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్‌లోకి రావాలని,రోహిత్‌కు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెడితే తమను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యుడు రంజిత్‌నాయక్ రోహిత్‌రావుకు వ్యతిరేకంగా మాట్లాడారన్నారు. తనను సైతం రమ్మంటే తాను వెళ్లలేదని చెప్పారు. రమేశ్ వెంట పలు తండాలకు చెందిన గిరిజనులు, ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చెక్‌పోస్ట్ ఏర్పాటు**



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై మెదక్ – దుబ్బాక నియోజవర్గాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌టీ టీం బృందం సభ్యులు ప్రతీరోజు వహనాలు తనిఖీ చేస్తారని తెలిపారు.

◆ **బైక్ అదుపుతప్పి యువకుడి మృతి**



రామాయంపేట(మెదక్): సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఆదివారం రామాయంపేటకు చెందిన బల్ల ప్రత్యూష్(24) బైక్‌పై హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళుతుండగా అదుపుతప్పి ఎగిరి పక్కరోడ్డులో పడ్డాడు. అదే సమయంలో ఆ రోడ్డులో వస్తున్న లారీ తనపై నుంచి వెళ్లింది. దీంతో ప్రత్యూష్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువకుడి కుటుంబ సభ్యులను మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు.

◆ **కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి**

రామాయంపేట(మెదక్): కేసీఆర్ కృషితో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని, మళ్లీ ఆయనే సీఎం కావాలని ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం బోధన్ పర్యటనకు వెళ్తున్న ఆయన మార్గమధ్యలో రామాయంపేట కొద్దిసేపు ఆగి విలేకరులతో మాట్లాడారు. కుల సంఘాలు, బీద, బడుగు బలహీన వర్గాలకు సంబంధించి సామాజికంగా న్యాయం జరగాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు జ్ఞానేశ్వర్‌ను సన్మానించారు.

◆ **బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు**

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని మాసాయిపేట మండలానికి చెందిన సుమారు వందమంది యువకులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం ఈ సందర్భంగా పార్టీలోకి వారు కండువా కప్పి ఆహ్వానించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేట బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మండలంలోని టీ.మాందాపూర్‌తండాకు చెందిన అశోక్ నాయక్ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

◆ **బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో మంచి స్పందన**

అల్లాదుర్గం(మెదక్): అందోల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి స్పందన ఉందని దక్షణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్ అన్నారు. సోమవారం అల్లాదుర్గంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

◆ **‘ఆ పార్టీలకు గుణపాఠం తప్పదు’**

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకు గుణపాఠం తప్పదని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్, టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన మాదిగల యుద్ధభేరి సభలో మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎస్సీ వర్గీకరణ చేపడుతామంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, 3, 4 ఆధ్వర్యంలో వలంటీర్లకు తొలిమెట్టు తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విజయభాస్కర్‌రెడ్డి రాంచంద్రం పాల్గొన్నారు.